# తెగిన బంధాలు

పెద్దింటి అశోక్‌కుమార్

(గత వారం తరువాయి)

పొద్దు గడుస్తుంది. ఇంట్లో వీడియో కెమెరా తిరుగుతుంది. అప్పుడప్పుడూ ఫోటో ఫ్లాష్‌లు. అటుఇటు తిరిగి మళ్ళీ టెంట్ కిందికే వస్తున్నారు ఇద్దరు. తమలోతాము ఏవో గొనుక్కుంటున్నారు. గుసగుసలాడుకుంటున్నారు. మాటల సరదా తీరాక ఎవరో కసురుకున్నట్టున్నారు. మొహం చిన్నబుచ్చుకుని టెంట్ కిందకి వచ్చాడు దేవయ్య.

"ఏమాయె అల్లుడా... ఇంక పిల్లగాన్ని తోలుకరాను ఎప్పుడు పోతవు. రేపేపెండ్లాయె" ఎత్తి పొడుస్తున్నట్టుగా అన్నాడు లింగం దేవయ్యను చూస్తూ.

"ఏదీ... ఏం సప్పుడులేదుగదా... ఓ కుమ్మరోల్ల తాతా లెవ్వు. లేచి గాడిపొయ్యిలు తవ్వపో... సాలిచ్చుకున్నవు" అన్నాడు నవ్వుతూ దేవయ్య.

బాలయ్య మాట్లాడ్డంలేదు. అతడి ఆలోచనలు ఎక్కడో ముడిపడ్డాయి. ఏ జ్ఞాపకాలనో నెమరువేసుకుంటున్నాయి. అది ఎవరిపెండ్లి...? ఎవరి పెండ్లి అయినాసరే! మూతులకు లెంకకంకనాలు పెట్టాల్సిందే! తన ఇంటికి చప్పుడుతో రావలసిందే. కూరాళ్ళయితే రెండురోజుల ముందే తీసుకెళ్లారు. ఐరేండ్లప్పుడే తనింట్లో సందడి. కొత్త దోతి, అంగితో తను ఉండాల్సిందే! కులవృత్తి ఏనాడో పోయింది. ఒక్క పెండ్లితంతులో తప్ప.

వదిన మరుదలో, బావరుదులో ఏదో ఒక వరుసున్నవారే ఐరేండ్ల గరిగబుడ్డిని ఎత్తుకోవాల్సింది. తాంబూలంనిండా తనకు బియ్యం, ఐదుకుడుకలు, కనుము, కర్జూరపు పండ్లు, చిల్లరకట్నం. ఇలాంటి పెండ్లీలు రోజూ జరగాలనే తన దీవెన! కనీసం పెండ్లీలకైనా తనసారె తిరగాలనే ఆశ!

మొగాళ్ళయితే భార్యల పేరడిగి, ఆడవారయితే భర్తల పేరడిగి జౌజుతో పలకలు అద్ది గీతలు గీచిన ఐరేండ్లు తన చేత్తోనే నెత్తి మీద పెట్టాల్సిందే!

పెద్దిండ్లల్లో పెండ్లి జరుగుతుందంటే నెల్లాల్ల ఖర్చులు దొరుకుతాయన్న ఆశ. బియ్యం దొరుకుతాయన్న సంబూరం. ఇంటిల్లపాదికి విందు భోజనం.


పెండ్లి సంబరాల నుండి ఒక్కొక్క కులం వెలివేయబడింది. పల్లకిమోసే బెస్తవాళ్ళనుంచి తోరణాలకు నులుకతాడు ఇచ్చి డప్పులు కొట్టేమాదిగల దాకా! సంబరంగా, సంతోషంగా, అదొక వృత్తిలా చేసే పనుల్లోకి వ్యాపారం, పెట్టుబడి సొచ్చుకువచ్చింది. వేరుచేయలేవన్న కులవృత్తులు కూడా ఇప్పుడు. మిగిలిన ఒక్క జ్ఞాపకం తెగిపోయింది.

"మామా... ఓ బాలయ్యమామా... ఏందే మాట్లాడవు. ఏమైంది?" లింగం కుదుపుతో మామూలు మనిషి అయ్యాడు బాలయ్య.

అప్పటికి పొద్దువాలింది. కార్లమీద మోటారు సైకిళ్ళమీద ఎవరో వస్తున్నారు. వచ్చినంత తొందరగానే వెళ్ళిపోతున్నారు. పటేలు స్కూటర్‌మీద ఎక్కడెక్కడో తిరిగి వస్తున్నాడు. మళ్ళీ వెళ్తున్నాడు. పొద్దుగూకుతుండగా తమ్ములి సొన్నాయివాడొచ్చి పావుగంటసేపు పలికి వెళ్ళాడు. ముగ్గురూ టెంటు చుట్టూ కాలుగాలిన పిల్లిలాగ తిరుగుతున్నారు. అప్పుడప్పుడు ఇంట్లోకి వెళ్ళి ఏదో సమాచారం తెస్తున్నాడు దేవయ్య.

రాత్రి భోజనాలకు మరోసారి పిలుపు. నిరుత్సాహంగా చేతులు కడుక్కున్నారు. ఎక్కువమంది చేరుకోవడంతో ముగ్గురిని టెంటులోనే కూర్చోబెట్టారు. పక్కనే కుర్చీవేసుకుని కొండల్‌రావు కూర్చున్నాడు మాట్లాడుతూ. అమెరికా సంబంధమని, ఆస్తి ఉన్నవారని ఏదేదో చెబుతున్నాడు. అతడి మాటల్లాగే ముద్దలు కూడా మింగుడు పడడంలేదు. ఎప్పటి నుండో అడగాలని ఉబలాటపడుతున్న మాటను అడగాలనుకుని తనకుతానే సిగ్గుపడి మానుకున్నాడు దేవయ్య.

భోజనాల తర్వాత లింగయ్యకు పిలుపువచ్చింది. పోయినసానం లేచివచ్చినట్టయింది. గోచిని గట్టిగా చెక్కుకున్నాడు. రాకరాక ఏదో గొప్ప అవకాశం వచ్చినట్టు హైరానా పడిపోయాడు. మిగిలిన ఇద్దరు



గుసగుసగా అతడికి సలహాలిస్తున్నారు. ఎక్కడినుండో కుంకుమబొట్టును తెచ్చి నుదుటన పెట్టాడు దేవయ్య. కొత్తకొత్తగా పెండ్లికార్యంలోకి అడుగుపెడుతున్నట్టు జేబులో మడిచిపెట్టుకున్న సంచిని బాలయ్యకు ఇచ్చి ఇంట్లోకి అడుగుపెట్టాడు లింగయ్య. ముగ్గురిమొహాలు వికసించాయి.

ఐదు నిమిషాలు గడవనేలేదు. మళ్ళీ టెంట్‌లో వాడిపోయిన మొహంతో ప్రత్యక్షమయ్యాడు. అతడిని చూసి ఇద్దరూ ఎదురెళ్ళారు. ఏంజరిగిందో అర్థంకాకపోయినా అతడు చేసే పనిమాత్రం మొదలు కాలేదని అర్థమయింది. బాలయ్య మౌనంగా ఉన్న దేవయ్యనే అడిగాడు ఏమైందని.

"ఏంలేదురా... అటుకుమీద సూట్‌కేస్ అందలేదట. నేను పొడువుగా ఉన్నానని నన్ను పిలచారు." నీరసంగా కూర్చుంటూ అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు. చలికి ఒదిగి కూర్చున్నారు.

ఇంట్లోకి వెళ్ళేప్పుడున్న మధురానుభూతిలోంచి లింగయ్య ఇంకా తేరుకోలేదు. అతడి కళ్ళముందు భోజలబండికాని కనిపిస్తుంది. పిల్లయినా, పిల్లగాడైనా, ఎవరో ఒకతోడుతో భోజలకానిపై కూర్చోవలసిందే!

"దొర్సానీ... వడ్లుతేండ్రి. ఇవ్వేసాలుతయా...?" పెండ్లిరేవనగా మైలపోలు తీసుడు.

ఇత్తడి తట్టలోని వడ్లను దోసిలి తోముంచి పోలుపోస్తున్నాడు. బండికాని చుట్టూ నాలుగుగీతల చతురస్రం. దానిచుట్టూ మరొకటి. అంచులకు గుండాలు. అడ్డంగీతలు. పోలుముంతల చుట్టూ దారం. మామిడాకు కంకనాలు.

ఇత్తడి తట్టతో ఐదుసార్లు తేవలసిందే. ఇల్లుతీరు తట్ట. పెద్దిండ్లల్లో పెద్ద తట్ట. నెత్తికి నూనె పెట్టి, పెయ్యంతా పసుపురాసి కాళ్ళవి వేళ్ళవి గోర్లు కత్తిరించడం. పెయ్యి మీదున్న బట్టలు తనకే! ఏం లేదన్నా తూమెడుపది కుంచాల వడ్లు. నూటపదార్లు కట్నం. మిత్తీసిన పైసలు. ఐదుగురు ముత్తైదువులతో వడ్లమిత్తి తీసుడు.

తాతలు, తండ్రులనాటి చరిత్ర. ఏండ్ల తరబడి పెళ్ళీలతో మమేకమైన జీవితాలు. ఆధునికతకు అలవాటుపడ్డాక మారిన అలవాట్లు, అలవాట్లకు తగినట్టుగా మారిన కులవృత్తులు. కత్తి, కలుప, పట్టుకుని ఇండ్లు తిరిగి గడ్డాలు కొరిగే స్థానంలోంచి ఎదిగిన పోరగాండ్లు రోడ్డుమీది టేలాడబ్బాల్లోకి చేరడం, ఊర్లోజరిగే పెండ్లీలను నమ్ముకుని తను ఊరిలోనే ఉండడం... అన్నీ గుర్తుకొస్తున్నాయి.

కత్తికట్నం అడిగేరోజుల్లోంచి కత్తికి పనిలేక కత్తెరపట్టుకుని రోడ్డునపడే రోజువరకు బేరీజు వేసుకున్నాక మిగిలిన పెండ్లి సంబరాల సంబంధాలు ఇప్పటితో పుటుక్కుమని తెగిపోయినట్టయింది. తన భార్య మంత్రసానిగా చేసేది. బొడ్డుకోసి పురుల్లు చేసేది. పచ్చిబాలింతకు తలస్నానాలు, పురుడుకట్నాలు, ముక్కగుడాలు కల్లుసీసలు... మనిషి పుట్టుక, పెండ్లి, సావుదాక ఒక వృత్తితో మరొకవృత్తికి అల్లుకుపోయిన అవసరాలు ఎక్కడో తీరిపోతున్నాయి. డబ్బుతోనే డబ్బు పుడుతుంది. జీవితంతో ముడిపడిన అవసరాలు అవకాశంగా పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

ఎవరో కుదుపగా లేచినిలబడ్డాడు లింగయ్య. చలాకీగా తిరిగే దేవయ్యలో కూడా ఉత్సాహం చచ్చిపోయింది. టెంటులోకి రెండు కార్పెట్లు వచ్చాయి. పటేలు ఇంట్లోకి వచ్చి పడుకొమ్మని బలవంతం చేసాడు. అక్కడే బాగుంటుందని టెంట్‌లోనే కార్పెట్లు పరుచుకున్నారు. ఒకటి కప్పుకున్నారు. వణుకు పుట్టించే చలి. దానికంటే ఎక్కువగా వణికించే విషయం. పెండ్లి పనుల్లోంచి తాము వేరుచేయబడ్డామని.

పిల్లగానిది ఏ ఊరో ఏ పల్లెనో! ఈ టైంకు ఆ ఊర్లె ఉండుంటి. కూరగాయలకట్నం కాడనైతే ఇంత వరకు ఎవరితో పేచీ పెట్టుకోలేదు. ఎంత ఇస్తే అంతే

తీసుకున్న.' అనుకున్నాడు దేవయ్య! రకానికొక్కటి కూరగాయలను మూటగట్టుకుని పిల్లవాడిని తోలుకరావడానికి పోదుంటిని. మానాయిన నైతే అందరికంటే ముందుగనే నడిచిపోయి ఎంతమంది వస్తుండిరో చెప్పుతుండెనట. ఇప్పుడా
గోస తప్పింది. జేబులపోయి జేబులోనే రావడం. ఏ ముల్లె తీసుకపోయినా జేబులోనే... మోత తప్పింది! ఇప్పుడు అదిలేదు ఇదిలేదు. ఉన్నది ఊసిపాయె. దిడ్డిపాసిపాయె! దేవయ్యలో వణుకు.


ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదుగాని ఎవరు ఏం ఆలోచిస్తుంద్రో తెలిసిపోతుంది. వారంరోజుల పెండ్లీల నుండి గంటల పెండ్లీల వరకు జరుగుతున్న మార్పులను, జరిగిన రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న బాలయ్యకు ఎందుకోగాని మరీ వెలితిగా ఉంది. మార్పు జరిగిన రోజుల్లోంచి మాత్రమే చూసి కారణాలు వెదుకుతున్న దేవయ్యకు ఇలా జరగడం కొంతవరకు మామూలుగానే అనిపిస్తుంది. ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉన్న లింగయ్య జీర్ణమై జీర్ణం కానట్టు తొక్కులాడుతున్నాడు.

ఏ రాత్రికోగానీ నిద్రపట్టలేదు. లేచిచూస్తే ఇంట్లో సందడి. దేవయ్యకు ఇంట్లో చిల్లరపని దొరికింది. బాలయ్య పైపును అందుకుని నీళ్ళు నింపడం మొదలెట్టాడు. బట్టల సూట్‌కేస్‌లు ఇంట్లకూ బయటకు మోయడంలో మునిగిపోయాడు లింగయ్య. బాధను మర్చిపోవడానికే ఏదో పని చేస్తన్నట్లుగా ఉన్నారు ముగ్గురు. బేలగా చూస్తున్నారు. బిరిపోయినట్లు నిలబడుతున్నారు. ఉలిక్కిపడి పనిలో మునిగిపోతున్నారు.

పొద్దుపైకెక్కుతున్నకొద్దీ హడావిడి పెరిగింది. అందరినీ ఎక్కడో కట్టగట్టి ఆపి ఒక్కసారి వదిలేసినట్టు గుంపులుగుంపులుగా జనం.

ముగ్గురికీ టిఫిన్ తిన్న ప్లేట్లు కడిగే పని దొరికింది. దేవయ్య ప్లేట్లను తెచ్చి ఇద్దరిముందు వేస్తున్నాడు. పెద్దపెద్ద దేకీసాలు, బగోన్లు, అండలు కడుగుడు, వాటికి మసి అంటకుండా బురదను పట్టించుడు, తోమినందుకు కట్నం అడుక్కునుడు అన్ని గుర్తుకు వస్తున్నయి. చేతులపని ఎవరో లాక్కున్నట్టనిపించింది.

"ఏది తప్పిపోయినా తిండిమాత్రం తప్పదిగదా! బోల్ల తోమేపని దేవిగానికి తప్పక ఉంటదనుకున్న. ఆ పని గూడా గోవిందా..." ప్లేట్లు కడుగుతూ అన్నాడు లింగయ్య.




పేలవంగా నవ్వి పనిలోపడ్డాడు బాలయ్య. ఎక్కడినుంచి చూసాడో కొండల్‌రావు పరుగుపరుగునవచ్చాడు. అతడి మొహంనిండా బాధ.

"అరేయ్... మీరెందుకు కడుగుతున్నార్రా. కడిగెతందుకు మనుషుల్ని పెట్టిన. మీరులేచి టిఫిన్ తినుండ్రి..." అంటూ ఎవరినో ఏదో పురమాయిస్తే ఇద్దరు ఆడమనుషులచ్చి చేతుల్లోని ప్లేట్లను లాక్కున్నారు. ఆ పనిచేయడం ఏమాత్రం అవమానంగా లేదు ముగ్గురికి. పోగొట్టుకున్న పనేదో వెదుక్కున్న

ముగ్గురికీ టిఫిన్ తిన్న ప్లేట్లు కడిగే పని దొరికింది. దేవయ్య ప్లేట్లను తెచ్చి ఇద్దరిముందు వేస్తున్నాడు. పెద్దపెద్ద దేకీసాలు, బగోన్లు, అండలు కడుగుడు, వాటికి మసి అంటకుండా బురదను పట్టించుడు, తోమినందుకు కట్నం అడుక్కునుడు అన్ని గుర్తుకువస్తున్నయి. చేతులపని ఎవరో లాక్కున్నట్టనిపించింది.



ట్లుగా ఉంది. చేతుల్లోని పనిని ఎవరో లాక్కున్నట్టుగా ఉంది ఇప్పుడు. పాణం గిలగిల కొట్టుకుంటుంది. కలలో నడుస్తున్నట్టుగా ముందుకు కదిలారు.

టిఫిన్లు కాగానే పెండ్లికి ప్రయాణమయ్యారు. పొద్దుట్నుంచీ మేకప్‌కు కూర్చున్న పెండ్లికూతురు కారులో బయలుదేరింది. వెంట కెమేరాలు. మిగిలిన వారు జీబుల్లో! జీబుల్లో సర్దాల్సిన సూట్‌కేస్‌లు సర్ది చివరి ట్రిప్పులో ముగ్గురు. ఎక్కడికి వెళ్తున్నారో తెలిసిపోయింది.

'వెంకటేశ్వరా ఫంక్షన్ ప్యాలెస్' బోర్డు లేత ఎండకు మెరుస్తుంది. ముందు కార్లు, జీబులు, సైకిల్ మోటార్లు. రకరకాల మనుషులు. పైన వేదిక. చుట్టూ అల్లిన పువ్వులు. సన్నాయి చప్పుడు. స్పీకర్లో పంతులు చదివే పద్యాలు. ఎక్కడచూసినా ఖరీదైన వాతావరణం, మాటలు, నడక!

స్టేజికి అటువైపు ఇటువైపు రెండు గదులు. అటూ ఇటూ తిరుగుతున్న ఆడవారు. కింద వరసగా కుర్చీలు.

ముగ్గురూ చివరగా వెళ్ళి నిలబడ్డారు. పెండ్లి కార్యక్రమం మొదలైంది. పటేలు, దొర్సాని, కొడుకూ కోడలు.... ఎవరు తలెత్తిచూసినా తమకొరకే అన్నట్టుగా ముందుకు కదులుతున్నారు. ఏ పద్ధతిలో సాగుతుందోకాని కార్యక్రమం నడుస్తుంది. అంతవరకూ గమనించలేదుకానీ అక్కడున్న వారిని చూసాక సిగ్గుగా తమని తాము చూసుకున్నారు. అందులోకి రావడానికి కూడా ఒక హోదా ఉండాలన్నట్టుగా అక్కడి మనుషులందరూ ఒకేరకమైన దర్పంతో డాబుతో కనబడుతున్నారు. అది గుర్తించాక ముళ్ళమీద నిలబడ్డట్టుగా ఉంది ముగ్గురికి.

రెండువైపుల రెండు వీడియోకెమెరాలు, రెండు మూడు ఫోటో కెమెరాలు, సెంటుస్ప్రే, హడావుడిగా తిరిగే మనుషులు... ఫంక్షన్‌ప్యాలెస్‌లో పెళ్ళి అంటే విన్నారుకానీ ఇలా ఉంటుందని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

"అరే దేవయ్యా! పటేలు ఎవలకొరకో చూస్తుండురా... నీకోసమే కావచ్చు. ఇప్పుడు పోలుపోత్తురు కావచ్చి. రుమాలు చుట్టుకుని పోరా..." మోచేత్తో పొడుస్తూ ఉడికిస్తున్నట్టుగా అన్నాడు లింగయ్య.

"ఈ... తియ్య... నీ మురిపెమే చెప్పరాదు. పిల్లపిల్లగాడు ఎదురెదురుంగ కూసున్నరుట. ఇప్పుడు పోలుపోసుడేంది చిత్రంగా..." అన్నాడు నీరసంగా దేవయ్య.

దోసిళ్ళతో బియ్యం ముంచిపోలు పొయ్యటం బియ్యం తీసుకరండని గదమాయించడం, పోలుముంతలు దారాలు, పసుపుకొమ్ములు, కంకనాలు అన్నీ కళ్ళముందు కదులుతున్నాయి దేవయ్యకు. తన చిన్నప్పటినుండీ చూసిన పెళ్ళిల్లు, కొట్లాడి తెచ్చుకున్న కట్నాలు, 'సాకలోడివంటే పెద్దకొడుకువురా బిడ్డ! సావుకుతలారోడు పెండ్లికి సాకలోడు పెద్ద కొడుకులు. వీల్లేగదా అన్ని పనులకు ముందు నడిచేది' అన్నమాటలు గుర్తుకొచ్చాయి. పెళ్ళితో అల్లుకుపోయిన కథలు అనుభవాలు గుర్తుకొచ్చాయి తీపితీపి జ్ఞాపకాల్లా!

"లింగమూ... ఇక్కడ మనముంటే అందరూ మననే చూస్తున్నరు. ఔతలికి పోదాం పదరా... ఇది మనసొంటోల్లుండే జాగకాదు. చేటెరుగని బొడ్డి మొగని పెండ్లికి పోయినట్టుంది మన కథ. ఆసపడ్డ నొట్లె పాసువడ్డట్టయింది. ఉన్నోళ్ళు ఉన్నోళ్ళతోనే సోపతి జేస్తరు. పాముకుసమిడినట్టు ఎప్పుడో ఒకయాల్లన తెలువకుంటనే మనం దూరమైతున్నం." లింగం చెయ్యిపట్టి లాగుతూ అన్నాడు బాలయ్య.

చప్పుడు మోగుతుంది. తలంబ్రాలు ఎత్తుతున్నారు. వీడియోలో రంగురంగులుగా కనపడడానికి బియ్యంలో పేలాలు, రంగుల బంతులు కలుపుతున్నారు. ఇండియాలో పెళ్ళిపద్ధతులంటే అమేరికా వారికి చాలా ఇష్టమని సాంప్రదాయపద్ధతిలో పెళ్ళి జరిపించాలని పట్టుబట్టారని అక్కడివారు అనుకుంటుంటే విని అర్థంకాని అయోమయంతో ముగ్గురూ బయటకు నడిచారు.

చప్పుళ్ళను, సందడిని బట్టి లోపల ఏంజరుగుతుందో అంచనా వేసుకుంటున్నారు ముగ్గురు.

"ఇప్పుడు భోజనాలకు లేచినట్టున్నారు." దేవయ్య అన్నాడు కొంతసేపు ఆగినాక.

గేటుముందు ఆటో ఒకటి ఆగింది. లోపలి నుంచి కుర్చీలను మడతలుగా పెట్టి ఆటోలో వేస్తున్నారు. 'అక్కడ పెళ్ళికి టయమయింది. తొందరగా!' వెంటనున్న మనిషి తొందరపెడుతున్నాడు టైం చూసుకుంటూ.

బ్రాహ్మణుడు బండిమీద పిట్టలా ఎగిరిపోయాడు. వెంట ఎవరో ఉన్నారు. ఒక్కొక్కరే వాహనాలను వెదుక్కుంటూ వెళ్తున్నారు.


హడావుడిగా ఎక్కడికో వెళ్ళబోతూ ముగ్గురిని చూసి పరుగుపరుగున దగ్గరికి వచ్చాడు కొండల్‌రావు. "అరే... మీరు ఇక్కడున్నరేందిరా...? అన్నం తినుపోండ్రి. నిన్నటినుండి సూత్తున్న మూలమూలలు

ఈగినట్టున్నరేందిరా..." అడిగాడు.

ఎవరూ నోరు తెరువలేదు. అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి నడిచారు. కుర్చీలు వేసిన స్థానమంతా ఖాళీగా కనిపించింది. పెండ్ల పందిరి వద్ద కొద్దిగా సందడి. ఎవరూ కన్నెత్తి అటువైపు చూడలేదు. అన్నం తినే చోటికి నడిచారు. అక్కడ మంది పలుచబడ్డారు. అడుగుతూసి అడుగు పెట్టలేనట్టుగా బొక్కలు, అన్నం మెతుకులు. ఎంగిలిపల్లాల్లో కూడా. ఎవరో దులుపుతున్నారు. ఎవరో కడుగుతున్నారు. రకరకాల వంటలు, స్వీట్లు, ఐస్‌క్రీం. తిన్నదానికంటే ఎక్కువగా విడిచిపెట్టిందే!

'ఇస్తార్లు వేసి కూసుండబెట్టిపెడితె కూరయినా అన్నమైనా బరుకతుంటది.' ఆ భీభత్సాన్ని చూసి వికారంగా మొహంపడుతూ అన్నాడు బాలయ్య.

"ఆ... ఇంత అద్వాన్నంగా మాత్రం కాదు" ముక్కురిల్లిస్తూ అన్నాడు దేవయ్య. ఎవరిపెండ్లో గుర్తుకులేదుగాని పందిట్లో మేకపిల్లను కొయ్యబోతూ విడిచిపెడితే మేకదొరుకక పొద్దంతా తిరిగానని, ఒక పెండ్లిలో మేక అనుకుని రాత్రిపూట దుడ్డెను కోసినమని తండ్రి నవ్వుతూ చెప్పినమాటలు ఎందుకోగాని దేవయ్య బొచ్చెలో మెరిసినయి.



అక్కడి అంగడి చూసాక ఇంతకుముందు డాబుగా దర్జాగా కనిపించినవారేనా ఇలా తిన్నది అనిపించింది. ఎవరికీ తినబుద్ధికాలేదు. నీళ్ళు మాత్రం తాగి బయటకు వచ్చారు ముగ్గురు.

వారికొరకే నిలిచినట్టు బయట జీపు. అందరితోపాటు ఎక్కి కూర్చున్నారు. ఐదు నిమిషాల్లో ఇంటిముందున్న టెంట్ మాయం. అంతా ఖాళీ!

ఇంట్లో ఇంటివాళ్ళదే సందడి. ఎక్కడెక్కడో తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చారు ముగ్గురు. పెళ్ళికూతురు కొత్త పెళ్ళికళతో ఎదురయింది. అమేరికా పెళ్ళికొడుకు అక్కడలేడు. దొర్సాని హడావుడిగా తిరుగుతుంది. నాలుగైదు కొత్త మొహాలు. పటేలు మాత్రం తీరిగ్గా కూర్చున్నాడు. ముగ్గురిని చూడగానే దగ్గరికి పిలిచి సంతోషంగా అడిగాడు.

"పెళ్ళి ఎలా జరిగిందిరా బాలూ... మంచిగనిపిచ్చింద... మా చుట్టాలయితే గ్రాండ్‌గ చేసినవంటుండ్రు. చిన్నఖర్చయినాదిరా..."

గంగిరెద్దుల్లా ముగ్గురూ తలూపారు.

"మల్లెపూల దండలకే ఐదువెయిలయినయి. డెకరేషనుకు, పెండ్లిసెట్టుకు ఇరువైవెయిలు, టెంట్‌కు సౌండ్స్‌కు..."

అన్నీ వెయిలలెక్కలే! ఏవేవో ఎన్నడూ వినని మాటలు చెబుతున్నాడు పటేలు.

"పటేలా పోయస్తం. లేటయితే బస్సు దొరుకది." ముగ్గురూ ఒకేసారి అన్నారు.

"అగో... అంతతొందరేందిరా! రేపు పొండ్రి. ఇంటికాడమావుల జేత్తరా." అదిలించాడు కొండల్‌రావు.

"వద్దుపటేలా వెళ్తం. ఇంటికాడ ఎదురుసూత్తరు. దొర్సాని ఏదో పనిల ఉన్నట్టుంది. పోయినమని చెప్పుండ్రు" చెప్పినా వినకుండా ముందుకుకదిలారు. మొహాల్లో రక్తం చుక్కలేదు. ఏదో పోగొట్టుకున్నట్టు వెలితి బాధ.

వీధిమలుపు తిరుగుతుంటే కేక వినిపించింది. ముగ్గురూ వెనక్కి తిరిగి చూసారు. ఇంట్లో పనిమనిషి పరుగెత్తుకు వస్తున్నాడు.

"ఇదిగో మీరు ఈ ముల్లెను మరిచిపోయిండ్రట." నెత్తిమీద ముల్లెను అందిస్తూ చెప్పాడు వెంట గోరుకాలు గిన్నెకూడా.

వాళ్ళు కనీసం విప్పిచూసినా, కులపోళ్ళతో కొట్లాడి రెండురాత్రులు నిద్రమాని ఔజుపలకలను అందంగా గీచినశ్రమను మర్చిపోయేవాడేమో బాలయ్య. ముల్లె ముల్లెలాగానే ఉంది. అందుకుని భుజాన వేసుకున్నాడు. ముందటికంటే బరువుగా అనిపించాయి. గోరుగాలు గిన్నెను జేబులో వేసుకున్నాడు లింగయ్య.

"మల్లెపూలకు ఐదువెయిలట. ఐదువందలిస్తే మనం ఆరునెలలు పేరు చెప్పుకుని తిందుంటిమి." బస్సెక్కుతూ గొణుక్కున్నాడు లింగయ్య.

"వాడంటే కార్లల్ల జీపులల్లవచ్చె... మల్లెపువ్వులు అమ్ముడంటే మనతమ్మలిరాములు జార్కిదండలు కట్టి ఇచ్చినట్టనుకుంటున్నావా...? అదో బిజినిస్" వెనక నుంచి అన్నాడు దేవయ్య.

ఊరి పొనిమేరల్లో దిగేసరికి చీకటి పడింది.

"బస్సు మలిగే చోటనే కంకర, ఇసుక, పూనాదులు, బేస్‌మిట్..." డ్రైవర్ విసుక్కుంటున్నాడు.

ముగ్గురూ బస్సు దిగారు.

"చూసినవామామా... పెండ్లకి ఖర్చులేం తప్పలేదు. ఒకటికి రెండింతలయనయి. అచ్చిన చిక్కల్లా మనసొంటోడు బతికే ఖర్చుగాదు. మనకు పూటతిండి దొరికే పెండ్లిగాదు. ఇంతకుముందు మనూర్లె ఏ పెండ్లి జరిగినా మన కింత తిండి దొరికింది. ఇప్పుడు చూసినవా! ఆ పద్ధతి సాపకింద నీరులెక్క ఇక్కడికస్తుంది." కట్టడాన్ని చూపిస్తూ అన్నాడు దేవయ్య.

లింగయ్యకూ బాలయ్యకూ ఒళ్ళు జలదరించింది. ఏదో రాక్షసగుహను చూసినట్టుగా భయమేసింది. ఆ సమాదుల్లో తమలాంటివారినెందరినో పాతరేసి పునాదులు లేపినట్టుగా అనిపిస్తుంది. ఇద్దరి కళ్ళల్లో సన్నటి నీటిపొర.

ఏదో గుర్తొచ్చినట్టు బాలయ్య గబగబ పునాదుల వద్దకు నడిచాడు. బుజంమీదున్న మూటను అందులో వేసి పిచ్చిపట్టినట్టు మట్టిని కప్పి ఊరివైపు వడివడిగా అడుగులేసాడు. అప్రయత్నంగా లింగయ్య చేతులు కదిలాయి. పునాదిలో గోరుకాలు, గిన్నె, ఐదుదోసిళ్ళమన్ను. పొట్ట చేతబట్టుకుని బాలయ్య వెంట అడుగులేసాడు. పునాదిరాళ్ళను, ఇసుక, కంకరను మార్చి మార్చి బాంబులు పేలుతాయా అన్నంత భయంగా చూస్తూ వారివెంట నడిచాడు దేవయ్య.

ఏడాది తిరక్కముందే... భవనంపై "వాసవి మ్యారేజ్ హాల్" బోర్డు వెలిసింది.

"కులవృత్తులు ఈనాడుకాదు ఏనాడో పోయినయి. కనీసం పెండ్లితో ముడిపడ్డ ఒకటి రెండు పనులు కూడా పట్టణాల్లో ఏనాడో పోయినయి. అది పల్లెలవరకూ వచ్చింది."

ముగ్గురూ కలిసి రోజూ ముచ్చటాడుకుంటున్నారు గతాన్ని తల్చుకుంటూ. ●

## బృహస్పతి గ్రహం పుష్యరాగం

పుష్యరాగం బృహస్పతి రత్నం. జ్యోతిష్య నమ్మకం ప్రకారం ఏ జాతకునికి గురువు శుభస్థితిలో ఉండునో వారు సుఖసౌఖ్యాలతో ఆనందంగా ఉంటారు. దీని విపరీత ప్రభావంచేత ఈ శుభ బృహస్పతి వల్ల అనేక రకాలైన బాధలు, కష్టప్రధానమైన స్థితులు ఏర్పడతాయి. పుష్యరాగం బృహస్పతి ప్రతికూల ఫలితాలను నివారించుటకు ఉపయోగపడుతుంది. ఇవి పసుపు, తెలుపు రంగులలో ఉంటాయి. ఇది ఒక ఖనిజరాయి. ఇవి లోకంలో అనేకచోట్ల లభిస్తాయి. రసాయన పరీక్షల ద్వారా వీటిలో అల్యూమినియం, హైడ్రోక్సిల్, ఫ్లోరిన్ తత్వాలు ఉన్నాయని తెలుస్తుంది. ఇవి హిమాలయాలలోను, శ్రీలంకలోను, రష్యాలోను లభిస్తాయి. వీటిని చేతిలోకి తీసుకొంటే బరువుగాను, చూడటానికి పారదర్శక స్థితిలోను కనిపిస్తుంది. ధను, మీన రాశులవారికి మంచి లాభదాయకంగా ఉంటుంది. పుష్యరాగం ధరించడం వల్ల బలం, బుద్ధి, ఆయువు, ఆరోగ్యం, కీర్తి మనశ్శాంతి లభిస్తాయి. వంశం వృద్ధిచెందుతుంది. కన్యల వివాహ విషయంలో ఏమైనా ఆటంకాలు ఉంటే ఈ పుష్యరాగధారణ వల్ల ఆ ఆటంకాలు తొలగిపోతాయి. గృహ జీవనం సుఖశాంతులతో ఉండటానికి పుష్యరాగం ధరించడం చాలాఉత్తమం. ఈ రత్నం భార్యాభర్తల మధ్య బాధలు, గొడవలు రాకుండా చేస్తుంది. వారి చరిత్ర పతనంకాకుండా నివారిస్తుంది. పుష్యరాగం రచయితలకు, లాయర్లకు, ఉద్యోగులకు, వ్యాపారస్తులకు విశేషప్రభావశాలిగా వుంటుంది. కోపం తగ్గించి బద్ధకాన్ని దూరంచేయడంలో సహాయం చేస్తుంది. మిత్రత్వాన్ని అభివృద్ధిచేస్తుంది. పుష్యరాగం భస్మాన్ని లేక దాని లేహ్యాన్ని సేవించుట వల్ల సామాన్య జ్వరం, దగ్గు, నోటి దుర్వాసన, కఫం, గ్యాస్‌ట్రబుల్, హ్యాడ్రోగం మొదలైన అనారోగ్యాలన్నింటిని నివారించడంలో ఉపయోగపడుతుంది. పుష్యరాగం ధరించిన రోజు నుండి నాలుగు సంవత్సరాల మూడు నెలల పద్దెనిమిది రోజులవరకు ప్రభావం చూపుతుంది. యే, యో, భ, భి, ధ, ఫ, ఉదా, భే అనే అక్షరాలు మొదటగల ధనురాశివారు, డా, డి, ఘు, జ, జ్ఞా, దే, చ, చి అనే అక్షరాలు మొదటగల మీనరాశివారు ధరించుట మంచిది. ఏ మాసంలోనైనా 12, 21, 30 తేదీలలో జన్మించినవారు, మార్చి 15 నుండి ఏప్రిల్ 13లోపు జన్మించినవారు, 3 అదృష్టసంఖ్యగా గలవారు, బృహస్పతి గ్రహం బలహీనంగా ఉన్నవారు ఈ రత్నాన్ని ధరించవచ్చు. పుష్యరాగాన్ని వాటి ఉపరత్నాలైన పసుపు ముత్యం, పసుపు జిర్కాను, పసుపు టర్మలైను, టోపాజులను వజ్రం, నీలం, గోమేధికం, వైఢూర్యంతో ధరించరాదు. పుష్యరాగాన్ని కెంపు, ముత్యంతో ధరించవచ్చు.



– డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి

SRI MAHARISHI RUDRAKSHA & NAVARATHNA EMPORIUM
No. : 13 Gayathri Towers,
Opp. Old Busstand,
Near Kesineni Tours & Travels
VIJAYAWADA-2
Phones : 0866-570199, 663335
BRANCH OFFICE :
6-3-354/10, Hindinagar,
Punjagutta, HYDERABAD.
Phone : 040-6636686, 6636696